క్లుప్తంగా

మైసమ్మకు ప్రత్యేక పూజలు



మదనాపురం: మండలంలోని గోవిందహళ్లి గ్రామశివారులో కొలువుదీరిన మైసమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.

ఇంటింటికీ బీఎస్పీ



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలం నాగరాలలో ఆదివారం ఇంటింటికీ బీఎస్పీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఘనపురం కృష్ణ మాట్లాడుతూ బీఎస్పీతోనే బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి సాధ్యమవుతుందన్నారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఎల్లస్వామి, గుడిసె ధర్మ, దేవుని శ్రీనివాస్, రాము, రాజు, కురుమూర్తి, బొక్కలయ్య, నాగేష్, పులేందర్ స్వామి, గట్టయ్య, గణేష్ పాల్గొన్నారు.

డీకే శివకుమార్‌ను కలిసిన చిన్నారెడ్డి



వనపర్తిటౌన్: కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌ను మాజీ మంత్రి, ఏఐసీసీ కార్యదర్శి చిన్నారెడ్డి ఆదివారం కలిశారు. కర్ణాటకలోని డీకే శివకుమార్ నివాసంలో ఇరువురు సమావేశమై పలు అంశాలపై చర్చించారు. కర్ణాటకలో కాంగ్రెస్ విజయం సాధించిన తీరు, తెలంగాణ రాష్ట్ర రాజకీయాలపై సుదీర్ఘంగా చర్చించినట్లు పార్టీ నాయకులు తెలిపారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

చిన్నంబావి: అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని బీఎస్పీ నాయకులు అన్నారు. మండల కేంద్రంలో అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మెకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏళ్లుగా పని చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లను ప్రభుత్వం పట్టించుకోకవడం సరికాదన్నారు. శాంతియుతంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్న అంగన్‌వాడీలను అధికారులు బెదిరింపులకు పాల్పడడం తగదన్నారు. వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, రూ.26వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ తాలూకా కార్యదర్శి పెరుమాల ప్రకాష్, ఉమ్మడి మండల ఇన్‌చార్జ్ సుధాకర్, గోవిందు, భాను, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె నోటీస్

అమరచింత: మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, కమిషనర్ మహమ్మద్ ఖాజాకు కార్మికులు సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభాకర్ మాట్లాడుతూ కార్మికులను క్రమబద్ధీకరించాలని, కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేయాలని, రూ.21వేల వేతనంను ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈనెల 8నుంచి సమ్మె చేపట్టనున్నట్లు తెలిపారు. 3వ తేదీన హైదరాబాద్‌లో ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే కార్యక్రమాల్లో మున్సిపల్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ప్రేమ్‌కుమార్, హరికృష్ణ, తిప్పన్న, నాగరాజు, సునీల్, కాకి శ్రీను, రవీందర్, గొల్ల శ్రీను, కతలప్ప, లక్ష్మణ్, మాధవి, నాగమ్మ పాల్గొన్నారు.

శుభ్రత అందరి బాధ్యత



గోపాల్‌పేటలో శ్రమదానం చేస్తున్న ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు

ఆత్మకూర్: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ నాగరాజు అన్నారు. మున్సిపాలిటీలోని ఖానాపూర్‌లో ఆదివారం స్వచ్ఛతాహీ సేవ, వేస్ట్ టు వండర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో కలిసి శ్రమదానం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణకు ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రోడ్లు, డ్రెయినేజీల్లో చెత్తాచెదారం వేయొద్దని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్, కౌన్సిలర్ చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో శ్రమదానం నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్లను ఊడ్చి శుభ్రం చేశారు. డ్రెయినేజీల్లో చెత్తాచెదారం తొలగించారు. ఇంటింటి నుంచి చెత్త సేకరణ చేపట్టారు. అదేవిధంగా పరిసరాల శుభ్రతపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మదనాపురం: యూత్ ఫర్ యాక్షన్ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక గురుకుల పాఠశాల విద్యార్థులకు స్వచ్ఛతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే శాస్త్రవేత్త భవాని వర్మి కంపోస్ట్ తయారీ విధానాన్ని తెలియజేశారు. పెరటి తోటలకు వర్మి కంపోస్ట్ వినియోగించడం వల్ల కూరగాయలతో పాటు సమతుల్య ఆహారం పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త అనిత పాల్గొన్నారు.

వీపనగండ్ల: వ్యాధుల వ్యాప్తిని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మండల వైద్యాధికారి వంశీకృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందితో కలిసి పీహెచ్‌సీ పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం డాక్టర్ మాట్లాడుతూ వ్యక్తిగత శుభ్రత పాటించడంతోపాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.



మదనాపురంలో..



అమరచింతలో..



వీపనగండ్ల పీహెచ్‌సీలో..

ఖిల్లాఘనపురం: స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంతో పాటు మానాజీపేట, అప్పారెడ్డిపల్లి తదితర గ్రామాల్లో శ్రమదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటించడంతోపాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

గోపాల్‌పేట: మండల కేంద్రంలో ప్రజాప్రతినిధులు, అధికారులు శ్రమదానం చేశారు. బస్టాండ్‌తోపాటు రోడ్లను ఊడ్చి శుభ్రం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాసులు, జెడ్పీటీసీ భార్గవి కోటిరెడ్డి, వైస్‌ఎంపీపీ శేఖర్ పాల్గొన్నారు.

అమరచింత: అందరం కలిసికట్టుగా స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దుకుందామని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, వైస్‌చైర్మన్ జీఎస్ గోపి పిలుపునిచ్చారు. స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా రాజవళి పార్కులో పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్లు, డ్రెయినేజీల్లో చెత్త వేయకుండా మున్సిపల్ సిబ్బందికి అందజేయాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఖాజా పాల్గొన్నారు.



పాన్‌గల్ మండలం తెల్లరాళ్లపల్లితండాలో..



ఆత్మకూర్‌లోని ఖానాపూర్‌లో..

గిన్నిస్ వరల్డ్ రికార్డర్‌కు సన్మానం



ప్రశాంతిని సన్మానిస్తున్న సాహితీవేత్తలు

వనపర్తిటౌన్: గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్‌లో స్థానం దక్కించుకున్న పట్టణవాసి మారం ప్రశాంతిని ఆదివారం సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్ మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి చెందిన ప్రశాంతి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో స్థానం దక్కించుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో తెలుగు భాష సంరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు కందూరు నారాయణరెడ్డి, భైరోజు చంద్రశేఖర్, దేశ్ రాములు, చెన్నపద్మ, పాల్కంపల్లి సుజాత, బండారు శ్రీనివాస్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

రైతులను ఇబ్బంది పెట్టడం తగదు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరామ్

పెబ్బేరు రూరల్: రుణమాఫీ విషయంలో కొందరు బ్యాంకర్లు రైతులను ఇబ్బందులకు గురిచేయడం తగదని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు, సీపీఐ జిల్లా కార్యదర్శి శ్రీరామ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2018 వరకు రూ.లక్ష లోపు ఉన్న రుణాలను మాఫీ చేశామని ప్రభుత్వం ప్రకటించగా.. చాలామంది రైతుల రుణాలు మాఫీ కాలేదని, రుణాలను చెల్లించాలని బ్యాంకర్లు నోటీసులు ఇస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రుణమాఫీ డబ్బులను బ్యాంకులకు పంపాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని, అందుకు రైతులను బాధ్యులను చేస్తూ నోటీసులు ఇవ్వడం సరికాదన్నారు. రైతులపై బ్యాంకర్ల వేధింపులకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు. పాన్‌గల్ మండలంలో రుణమాఫీ సమస్య అధికంగా ఉందని తెలిపారు. రుణమాఫీలో ఏమైనా అడ్డంకులు ఉంటే బ్యాంకర్లు గుర్తించి పరిష్కరించుకోవాలని కోరారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు కళావతమ్మ, కుర్మయ్య, పెద్ద హనుమంతు, చిన్న హనుమంతు ఉన్నారు.

ఘనంగా గణేశ్ నిమజ్జనం



దంతనూరులో గణపయ్య ఊరేగింపులో కోలాటం వేస్తున్న మహిళలు

మదనాపురం: మండలంలోని దంతనూరు ఆంజనేయస్వామి ఆలయంలో ప్రతిష్ఠించిన గణనాథుడి నిమజ్జనోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపయ్యకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై గణనాథుడి ఊరేగింపు చేపట్టారు. మహిళలు పెద్దఎత్తున పాల్గొని కోలాటం వేశారు.



ఎమ్మెల్యేకు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న మల్లయ్య

లడ్డూ ప్రసాదం అందజేత

వీపనగండ్ల: రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు ముంత మల్లయ్యయాదవ్ ఆదివారం కొల్లాపూర్‌లో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డిని కలిసి గణేశ్ లడ్డూ ప్రసాదం అందజేశారు. మండల కేంద్రంలో 12 రోజులపాటు విశేష పూజలందుకున్న గణనాథుడి లడ్డూ ప్రసాదాన్ని ఎమ్మెల్యేకు అందజేసినట్లు తెలిపారు. అభిలాష్‌రావు, ముంత శివ పాల్గొన్నారు.

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి



గణనాథుడికి పూజలు చేస్తున్న ఎస్‌ఐలు

పాన్‌గల్: ప్రశాంత వాతావరణంలో పండుగలను జరుపుకోవాలని ఎస్‌ఐలు వేణు, రాము అన్నారు. మండలంలోని రేమద్దులలో మిలీనియం యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పండుగలను అందరూ శాంతియుతంగా నిర్వహించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి వినాయకులను పూజించాలని కోరారు. కార్యక్రమంలో వెంకటయ్య, శ్రీవర్ధన్‌రెడ్డి, మహేష్, భాస్కర్‌గౌడు, కమలాకర్, కుమార్, మహేష్, అంజి, వంశీ, ఈశ్వర్ రాజేష్, గణేష్ పాల్గొన్నారు.

ఘనంగా శౌర్య జాగరణ యాత్ర



చిన్నచింతకుంటలో

చిన్నచింతకుంట: మండలకేంద్రంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శౌర్య జాగరణ ద్విచక్ర వాహన యాత్రను ఆదివారం ఘనంగా నిర్వహించారు. అనంతరం గ్రామంలో హనుమాన్ చాలీసా పఠనం చేశారు. భగవద్గీత గ్రంథాలను పంపిణీ చేశారు. పరిషత్ అఖిల భారత సహ కార్యదర్శి సత్యం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జగదీశ్వర్, జిల్లా అధ్యక్షులు జి. చంద్రయ్య, సభ్యులు రాచాల జనార్దన్, శివన్న, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుల హక్కులను కాపాడుదాం



వృద్ధులను సన్మానిస్తున్న జగదీశ్వరుడు

కొల్లాపూర్: వృద్ధుల హక్కులను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఇందిరాగాంధీ అభిమాన సంఘం జిల్లా అధ్యక్షులు రంగినేని జగదీశ్వరుడు అన్నారు. ఆదివారం ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని శ్రీవాణి విద్యానిలయంలో పలువురు వృద్ధులను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు ఆస్తుల కోసం వృద్ధ తల్లిదండ్రులను విస్మరించొద్దని సూచించారు. వృద్ధులకు అందరూ చేయూతనందించాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాది. మధుసూధన్‌రావు, జమీల్‌అహ్మద్‌ఖాన్, వెంకటస్వామి, శ్రీధర్, అన్వర్, బాలపీర్, జావీద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ ఉద్యమం ఉధృతం



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణయ్య

వనపర్తిటౌన్: ఎస్సీ వర్గీకరణ ఉద్యమాన్ని ఉధృతం చేసినట్లు ఎంఈఎఫ్ జాతీయ వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు ఎం.కృష్ణయ్య అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీఓ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నవంబర్‌లో నిర్వహించే పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 4న అలంపూర్ నుంచి మంద కృష్ణమాదిగ పాదయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ, హక్కుల సాధన కోసం చేపట్టిన పాదయాత్రలో ప్రజలు, మేధావులు, అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఎంఈఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు గద్వాల కృష్ణ, జిల్లా అధ్యక్షుడు వెంకటయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ గంధం భగవంతు, దాస్, రాజు తదితరులు ఉన్నారు.

ఉత్సాహంగా మిలాద్-ఉన్-నబీ ర్యాలీ



ఆత్మకూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

ఆత్మకూర్: మిలాద్-ఉన్-నబీ పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం ముస్లింలు ర్యాలీ నిర్వహించారు. మానవాళి కోసం ప్రవక్త చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. ప్రవక్త జీవితం శాంతి సందేశమని మౌలానాలు వివరించారు. పట్టణంలోని పురవీధుల మీదుగా ర్యాలీ అనంతరం ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్‌యాదవ్, ఎస్‌ఐ నరేందర్, మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పాన్‌గల్: మండల కేంద్రంలోని మసీద్ నుంచి ముస్లింలు ర్యాలీ నిర్వహించారు. మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా మిలాద్-ఉన్-నబీ వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. ర్యాలీ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుండా పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.



పాన్‌గల్‌లో..

అమరచింత: పట్టణంలో మిలాద్-ఉన్-నబీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక జామియా మసీదులో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం ముస్లింల ర్యాలీని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ ప్రారంభించారు. కార్యక్రమంలో మసీద్ కమిటీ అధ్యక్షుడు అయూబ్‌ఖాన్, అన్సారీ, ఖాజాహుస్సేన్, ఎండీ రఫీ, తౌఫిక్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

వీపనగండ్ల: మండల కేంద్రానికి చెందిన కోట్ల అలివేల అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదివారం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ముందుగా ఆమె పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జూపల్లి వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భీరయ్యయాదవ్, రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు ఎత్తం కృష్ణయ్య, చితంబర్‌రెడ్డి, కళ్యాణ్‌రావు, బస్వరాజుగౌడ్, గోపి, భరత్ కుమార్‌రెడ్డి ఉన్నారు.

పెబ్బేరు రూరల్: వనపర్తి మండలం నాగవరం గ్రామానికి చెందిన బాలమ్మ మృతి చెందింది. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఎన్నికల సమన్వయకర్త వంగూరు ప్రమోద్‌రెడ్డి మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. శ్రీరంగాపురం మండలం నాగరాలకు ఈశ్వరమ్మ అనారోగ్యంతో మృతి చెందగా, ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.14వేల ఆర్థికసాయం అందజేశారు. సర్పంచ్ నిర్మల, ఉపసర్పంచ్ చంద్రాయుడు, బీఆర్‌ఎస్ నాయకులు రాధాకృష్ణ, మహేశ్వర్‌రెడ్డి, గోవిందు, బోయ బిచ్చన్న, దొడ్డి కిష్టన్న ఉన్నారు.

పాన్‌గల్: మండలంలోని కేతేపల్లికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త వెంకటయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్ రెడ్డి, రైతుబంధు మండల కోఆర్డినేటర్ వెంకటయ్యనాయుడు, బీఆర్‌ఎస్ నాయకుడు రవికుమార్, జ్యోతినందన్‌రెడ్డి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి వెంట మార్కెట్ కమిటీ డైరెక్టర్ మదన్మోహన్‌గౌడ్, శ్రీనివాసులునాయుడు, రామకృష్ణ, పవన్, మౌలాలి ఉన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మదనాపురం: మండలంలోని దుప్పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1997–98బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకొని యోగక్షేమాలను తెలుసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులు కుర్మయ్య, శ్రీనివాస్, కర్ణాకర్, పుష్పలత, నర్సింహయ్యలను శాలువాతో సన్మానించి, మెమోంటోలను అందజేశారు. కార్యక్రమంలో వెంకట్రాములు, భాస్కర్, అంజనేయులు, జయరాములు, సమత, రాఘవేంద్ర, హెచ్‌ఎం ఆంజనేయులు పాల్గొన్నారు.

నేటి పాదయాత్రను జయప్రదం చేయండి

వీపనగండ్ల: మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో నిర్వహించనున్న సత్యమేవ జయతే పాదయాత్రను జయప్రదం చేయాలని మండల అధ్యక్షుడు భీరయ్యయాదవ్ ప్రకటనలో కోరారు. అంబేడ్కర్ విగ్రహం నుంచి గాంధీజీ విగ్రహం వరకు పాదయాత్ర కొనసాగుతుందని, మండల, గ్రామస్థాయి నాయకులతోపాటు కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మోదీ సభకు తరలిన బీజేపీ నాయకులు



ఆత్మకూర్ నుంచి మహబూబ్‌నగర్‌కు బయల్దేరిన బీజేపీ నాయకులు



పెబ్బేరు మండలం నుంచి..

ఆత్మకూర్: మహబూబ్‌నగర్‌లో ఆదివారం నిర్వహించిన ప్రధాని నరేంద్రమోదీ బహిరంగ సభకు ఆత్మకూర్ నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివెళ్లారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాదిరెడ్డి జలందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపాలిటీతోపాటు మండలంలోని గ్రామాల నుంచి ప్రత్యేక వాహనాల్లో బయల్దేరారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ అశ్విన్‌కుమార్, నియోజకవర్గ కన్వీనర్ రేచింతల శ్రీను, జిల్లా ఉపాధ్యక్షుడు నాగేందర్ రెడ్డి, గంగాధర్‌గౌడ్, శశిధర్‌రెడ్డి, భీంరెడ్డి, తమ్మలి వెంకటేష్, రాజు, ఎల్లన్న, గాడిశేషు, రఘుయాదవ్, బాలకృష్ణ, వెంకట్రాములు, రాము, యశ్వంత్, సూరి, బాలరాజు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: వనపర్తి, పెబ్బేరు, శ్రీరంగాపురం మండలాల నుంచి ప్రధాని మోదీ సభకు తరలివెళ్లారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలతోపాటు ప్రజలు ప్రత్యేక వాహనాల్లో బయల్దేరారు.

వీపనగండ్ల: ప్రధాని మోదీ సభకు పలు గ్రామాల నుంచి బీజేపీ, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. పేదల సంక్షేమానికి ప్రధాని మోదీ అనేక పథకాలను అమలు చేస్తున్నారని, బహిరంగ సభకు ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చినట్లు తెలిపారు. రామన్‌గౌడ్, రాకేష్‌యాదవ్, శివాజీ, నారాయణ, మహేష్ పాల్గొన్నారు.

అమరచింత: ప్రధాని నరేంద్రమోదీ సభకు పలు గ్రామాల నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మేర్వ రాజు, బీజేపీ పట్టణ అధ్యక్షుడు క్యామ భాస్కర్, అశోక్, నారాయణ, అనిల్, వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.